



## భ - గుణింతం

ఒక రాజుగారు కోపంవచ్చి ఒక కవికి మరణదండన విధించాడుట. ఉరికంబం సమీపించి ఎదురుగా ఉన్న రాజుగారితో యిలా అన్నాడుట ఆ కవి: "ఓ రాజా! నాపేరు భుక్కుడు. నీకా సంగతి జ్ఞాపకంలేక నాకు మరణ శిక్ష విధించేవేమో. భ—గుణింతంలో యముడు ప్రవేశించాడు. చూశావా భట్టుమూర్తి చనిపోయాడు, భీముడు చనిపోయాడు, ఇప్పుడు భుక్కుడనయిన నేను చస్తాను, కాని నా తరువాత భూపతివయిన నిన్ను చంపుతాడు సుమా యముడు" అని మరణ సమయంలోకూడా కవితా ధోరణిలో మాటాడగలిగిన అతనిగుండె ధైర్యానికి మెచ్చుకొని కవి చెప్పినది నిజమగునేమో యని భయపడి రాజు అతని మరణదండనను తొలగించి విడిచిపుచ్చి అతన్నిసన్మానించాడట. చూశారా సమయస్ఫూర్తి చక్కటిపనే చేసింది.

జి. వి. అప్పారావు పంతులు.

* * *

## మామగారి ధైర్యం

మమ్మల్ని చూట్టానికి మా ఆవిడ నాయన వచ్చాడు. ఆ రోజుల్లో మా వూళ్లో దొంగల హడావిడి ఎక్కువగా ఉంది. మా ఆవిడ నాతో "మానాయన ధైర్యవంతుడు. ఆయనున్నన్నాళ్లు భయంలేదం"ది.

భయంలేకుండా భోజనాల్చేసి మేడ మీదనున్న ఓదండెంపై తడిగుడ్డపిండి ఆరవేసి నిద్రపోయాం. అవి మసక వెన్నెలరోజులు.

మా మామగారలా దొడ్లోకి లఘుశంక కెళ్ళేరల్లేవుంది. ఆ గుడ్డను చూచి మసకవెన్నెట్లో తారుమన్నై. ఇంతలోకీ అనుమానానికితోడు పంది కొక్కుచప్పిడి, దొడ్లో ఎండి ఊగులాట్టాన్న తాటాకు గలగలా నెత్తిపై పడింది. "దొంగలు, దొంగలు" అని అరిచి మంచంమీద పడ్డాడు. అంతా పోగయ్యారు. "అక్కడే వున్నాడు పోబోకండి!" అన్నాడు మా మామ.

ఒకడు పోయిచూస్తే అది నేనారేసిన గుడ్డ. వూరివాళ్లంతా హేళనచేశేరు. తెల్లారింది లేదో ప్రయాణం కట్టాడు మామగారు!

"దిట్టకవి"

* * *

## మార్పు

నాకు పధ్నాలుగేళ్ళు వుండేప్పటి నుంచి నేను రాధను ఎరుగుదును. వాళ్లు, మేము ఒకే ఇంట్లో అద్దెకుండేవాళ్లం. ఆమె నాకంటె రెండేళ్ళు పెద్దదైనా నాతో ఎంతో చనువుగ మెలిగేది. వాళ్ళ ఇంట్లో యేమిచేసినా తప్పకుండా నన్ను బలవంతంచేసి తినిపించేది. రాధకు నామీద ఎంతప్రేమ వుండేదో, నాకు ఆమెపై రెట్టింపుప్రేమ వుండేది. నేను మా వూరువదలి కాలేజిలో చదవడానికి వెళ్ళినప్పుడు రాధ కంట తడిపెట్టింది. 'రామూ! నీవులేంది ఈ ఇంట్లో ఎలావుండేదోయ్? నన్ను జ్ఞాపకం వుంచుకొంటావా లేక కాలేజి ఆడపిల్లల గొడవలో మర్చిపోతావా?' అంది. 'ప్రపంచంలో ఎవర్నయినా మర్చిపోతునుగాని, నిన్ను ఎలా మరచిపోతాను రాధా!' అన్నాను.

మూడేళ్ళ అనంతరం రాధను చూచినప్పుడు ఆమె పూర్తిగా మారిపోయింది. ఆమెకు పెళ్లయింది. ఇప్పుడు నాతో మాట్లాట్టమే మానేసింది. ఆఖరికి ఆగలేక ఓ నాడు ఆమె చీరలు ఆరవేయడానికి మేడపైకి వచ్చినప్పుడు వెళ్ళి చెయ్యిపట్టుకొని 'ఇదేమిటిరాధా! నేనెవరో జ్ఞాపకమున్నానా? నీతో మాట్లాడాలని చచ్చిపోతున్నాను. నాపై కోపమా?' అన్నాను. అందుకు రాధ "రామూ! నాకుమాత్రం నీతో మాట్లాడాలని లేదూ? కాని ఇప్పుడు నాకు పెళ్లయింది. పరాయి మగవాడితో మాట్లాడితే లోకం సహించదు. లేని నిందలు మోపుతుంది. కాబట్టి నీవు నన్నుమరచిపో!' అంది వెళ్లిపోతూ. ఆమె మాటలకు, మార్పుకు నిశ్చేష్టుడై నిలచిపోయాను.

"ధాను."